క్లుప్తంగా

ఘనంగా సంక్రాంతి సంబరాలు



గోకవరం సచివాలయ ఆవరణలో భోగి మంట వేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, తదితరులు

గోకవరం: స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, ఎంపీడీఓ కె.పద్మ జ్యోతి, సర్పంచ్ కొమరం శ్రావణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సచివాలయ ఆవరణలో భోగి మంట వేశారు. మహిళలు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, నరాలశెట్టి నర్సయ్య, పులపర్తి బుజ్జి పాల్గొన్నారు.

నేడు తునిలో..

తుని: సంక్రాంతి పండగను పురస్కరించుకొని శుక్రవారం తునిలో నియోజకవర్గ స్థాయిలో సంబరాలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు గురువారం తెలిపారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు మహిళలకు రంగవల్లికలు, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

నేడు గోకవరంలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

గోకవరం: గ్రామ శివారున ఉన్న గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కోడి కత్తులు తయారు చేస్తున్న పలువురి అరెస్టు



గోకవరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కోడి కత్తులు

గోకవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి కత్తులు తయారు చేస్తున్న పలువురిని గురువారం గోకవరం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక వెలమపేటకు చెందిన వెదురాడ వెంకటరమణను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 277 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రవీంద్రనగర్ కాలనీకి చెందిన ఆగర్తి సతీష్, చుక్క వెంకటరమణ, ఆగర్తి వీరబ్రహ్మం, ఆగర్తి రామారావులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 223 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించామని ఎస్సై యువి శివనాగబాబు తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి గురువారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గంగాధరబట్ల గంగబాబు అవధాని, యనమండ్ర శర్మ, వంశీ, చిట్టెం నగేష్, దేవులపల్లి ప్రకాష్ తదితరులు హోమం నిర్వహించారు. మొత్తం 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

తాళ్లూరు శివాలయంలో ప్రత్యేక పూజలు

గండేపల్లి: మార్గశిర అమావాస్యను పురస్కరించుకుని గురువారం తాళ్లూరు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదోషం, కుజగ్రహ దోషం నివారణ పూజలు చేసినట్టు అర్చకులు తెలిపారు.

14న జిల్లా త్రోబాల్ జట్ల ఎంపిక

తుని: ఈ నెల 14న జిల్లా త్రోబాల్ జట్ల ఎంపిక స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో జరుగుతుందని జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మురళీమోహనరావు గురువారం తెలిపారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు ఆ రోజు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో అనంతపురం జిల్లా బత్తెనపల్లిలో జరిగే 45వ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 99485 68475, 97041 95745 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కిర్లంపూడి: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కిర్లంపూడి ఎస్సై పి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని వేలంక, కిర్లంపూడి, ముక్కొల్లు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించే స్థలాలను ఆయన పరిశీలించారు.

కర్షకా.. దిగులు లేదిక

- అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించిన ప్రభుత్వం
- భూములపై లబ్ధిదారులకు సర్వహక్కుల కల్పన
- నియోజకవర్గంలో 609 కుటుంబాలకు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



బెండపూడిలో రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న అధికారులు

తొండంగి: పేదలకు దీర్ఘకాలం క్రితం ఇచ్చిన అసైన్డ్ భూములపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంపూర్ణ హక్కులు కల్పించింది. అరెకరం, ఎకరం విస్తీర్ణంలో పోడు, మిగులు భూములను దీర్ఘకాలంగా సాగు చేసుకున్న పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా క్రయ విక్రయాలు చేసుకునే వీలు కల్పిస్తూ పట్టాలు పొందిన లబ్ధిదారులకు నో అబ్జెక్షన్ ధ్రువపత్రాలు ఇవ్వడంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

1977లో చట్టం

భూమి లేని పేదలకు భూములను ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేందుకు 1977లో ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల(బదలాయింపుల నిషేధ) చట్టాన్ని చేశారు. ఈ చట్టం 21-1-1977 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా భూమి లేని పేదలకు కొన్ని షరతులకు లోబడి భూమిని ఇస్తారు. ఈ భూమిపై ఎటువంటి అన్యాక్రాంతం, బదలాయింపులకు అవకాశం లేదు. ఈ చట్టం ప్రకారం భూమి పొందిన లబ్ధిదారులు కేవలం వంశపారంపర్యంగా సాగు చేసుకోవాలి తప్పా ఈ భూమిని తనఖాలు, మార్పులు చేసుకోవడం, కౌలుకు ఇవ్వడం, బహుమతిగా ఇవ్వడం వంటి లావాదేవీలు చెల్లవు.

తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో..

గత ప్రభుత్వాలు దీర్ఘకాలం క్రితం పలు దఫాలుగా పేదలకు భూములు చేశాయి. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల చట్టం ప్రకారం తొండంగి మండలంలో 305, తుని మండలంలో 136, కోటనందూరు మండలంలోని 168 వెరసి మొత్తం 609 మంది పేదలకు పట్టాలను ఇచ్చారు. పట్టాలు పొందిన లబ్ధిదారులంతా దీర్ఘకాలంగా సాగు చేసుకుంటూ ఆ భూముల్లో వ్యవసాయ, ఉద్యాన తోటలు ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు. లబ్ధిదారులు తమ కుమార్తెల వివాహాలు, అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో ఈ భూములను అమ్ముకునేందుకు వీలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దళారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వాటిని తీర్చేదారిలేక ఆర్థిక ఇబ్బందులు పడినవారెందరో ఉన్నారు. అసైన్డ్ భూములు కలిగిన రైతుల కుటుంబాలకు భద్రత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. 1977 అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించింది.

అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులు ఆ భూములను క్రయవిక్రయాలు చేసుకునేందుకు సర్వహక్కులు కల్పించింది. రైతులందరికీ పట్టాలతో పాటు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లను అందజేస్తోంది. ఈ మేరకు తొండంగి మండలంలోని 305 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఎన్నో ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ వాటిని విక్రయించుకునే వీలు లేక ఇబ్బందులు పడ్డామని, ప్రభుత్వం సర్వహక్కులూ కల్పిస్తూ పట్టాలివ్వడంతో తమ ఇబ్బందులు తొలగాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చారిత్రాత్మక నిర్ణయం



ప్రభుత్వం అసైన్డ్ భూములపై రైతులకు సర్వహక్కులూ కల్పించడం చారిత్మాత్మక నిర్ణయం. మండలంలోని 305 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఇకపై రైతులు తమ భూములను మార్కెట్ ధరలకు అనుగుణంగా విక్రయించుకోవచ్చు. తమ కుమార్తెలు, కుమారుల పేరున భూములను బదలాయించుకోవచ్చు. ప్రభుత్వ నిర్ణయంతో పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత ఏర్పడుతుంది.

–జి.సుబ్రహ్మణ్యం, తహసీల్దార్, తొండంగి మండలం

జగన్ చేసిన మేలును మర్చిపోలేం



మాకు దీర్ఘకాలం క్రితం బెండపూడిలో 1.52 ఎకరాలకు ప్రభుత్వం పట్టా ఇచ్చింది. ఈ భూమిని నా భర్త మాణిక్యం సాగు చేస్తూ మా కుటుంబాన్ని పోషించేవారు. సాగు ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో నలుగురు పిల్లలను పెంచి పోషించేందుకు ఇబ్బందులు పడ్డాం. నా భర్త కొంత కాలం క్రితం మరణించారు. మా భూమి అమ్ముకునే వీలు లేకపోవడంతో అవస్థలు పడ్డాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మా భూములను అమ్ముకోడానికి వీలుగా పట్టా ఇచ్చారు. ఆయన చేసిన మేలును జన్మలో మర్చిపోలేం.

–ఎరికిరెడ్డి మాణిక్యమ్మ, లబ్ధిదారు, బెండపూడి

సారా స్థావరాలపై ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో సారా స్థావరాలపై గురువారం ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ కథనం మేరకు పెదశంకర్లపూడి గ్రామ సమీపంలోనీ అటవీ ప్రాంతంలోని సారా స్థావరాలపై దాడి చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 1,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని, సంఘటన స్థలం నుంచి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నుంచి పరారైన నర్ల రాంబాబు, బత్తిన శివాజీలపై కేసు నమోదు చేశారు.

నేడు మండల సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

పేకాడుతున్న 11 మంది అరెస్టు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివనాగబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రంపయర్రంపాలెంలో పేకాడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.26,730 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం



రంగవల్లి నగర్‌లో బాధితులకు నగదు, నిత్యావరాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు, నిత్యావసరాల పంపిణీ

జగ్గంపేట: గ్రామ శివారు రంగవల్లి నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. రంగవల్లి నగర్‌లో అగ్నిప్రమాద బాధితులను ఆయన గురువారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల ఆర్థిక సాయం, దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏడు పూరిళ్లు దగ్ధం కావడం బాధాకరమన్నారు. గ్యాస్ సిలిండర్లు పేలడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తాత్కాలిక గృహాల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే కలెక్టర్‌కు రంగవల్లి నగర్ వాసులు ఎదర్కొంటున్న ఇతర సమస్యలను కూడా వివరిస్తామన్నారు. ప్రమాద ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శ్రీదేవికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, పార్టీ నేతలు అత్తులూరి సాయిబాబు, రావుల గణేష్ రాజా, గుర్రం మహాలక్ష్మి, ఎంపీడీఓ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆపన్నహస్తం

జగ్గంపేట: జగ్గంపేట శివారు రంగవల్లినగర్‌లో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు పలువురు దాతలు చేయూతను అందిస్తున్నారు. స్థానిక అమల క్లినికల్ ల్యాబొరేటరీ యజమాని సత్తిబాబు ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం అందించారు.

బాధితులకు పక్కా గృహాలు నిర్మించాలి

జగ్గంపేట: రంగవల్లి నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం రంగవల్లి నగర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ రెక్కాడితే కాని డొక్కాడని పేదల పూరిళ్లు దగ్ధం కావడంతో నిలువ నీడ కోల్పోయారన్నారు. అగ్నిమాపక మాపక సిబ్బందికి సమాచారం అందించిన వెంటనే రాకపోవడంతో ఎక్కువ నష్టం కలిగిందని ఆరోపించారు. ప్రభుత్వం అగ్ని ప్రమాద బాధితులను అన్నివిధాలా ఆదుకోవాలని, నష్ట పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్, జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, సహాయ కార్యదర్శి సతీష్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతికి సంతాపం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామ వీఆర్ఏ కొల్లాటి ప్రసాద్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. బుధవారం విధులు ముగించుకుని బైక్‌పై రాజానగరం వెళుతున్న అతని బైక్‌ను రాజానగరంలో కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గోకవరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌రావు, బిక్కవోలు తహసీల్దార్ కె.పోశిబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని గోకవరం తహసీల్దార్ అందజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు సమ్మెటి మోహన్, సర్పంచ్ సరకణం రామలక్ష్మి, పెనికేటి అచ్చిరాజు, మండలంలోని రెవెన్యూ సిబ్బంది ప్రసాద్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

సత్యదేవుని దర్శించిన విశాఖ పోస్ట్ మాస్టర్ జనరల్

అన్నవరం: విశాఖపట్నం రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహకాలు



మెప్మా బజార్‌లో డ్వాక్రా మహిళలకు సూచనలు ఇస్తున్న టీఎంసీ సాయికుమార్

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని మెప్మా టీఎంసీ సాయికుమార్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్‌ను అనుకుని గురువారం మెప్మా బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తోందన్నారు. వాపారంలో రాణించేందుకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోందన్నారు. మహిళలకు డ్వాక్రా రుణాలతో పాటు ఆహా క్యాంటీన్‌లు, మెప్మాబజార్‌లు తదితర అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డ్వాక్రా మహిళలు తాము స్వయంగా తయారు చేసిన వస్తువులను మెప్మా బజార్‌లో విక్రయించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు

ఏలేశ్వరం: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లంరాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజవర్గ కన్వీనర్ ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో స్థానిక షిర్డీ నగర్‌లో గురువారం నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లంరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఏలేరు ఆధునీకరణ, సుబ్బారెడ్డి సాగర్ అభివృద్ధి, ఎస్టీ, ఎస్సీ నిధుల వినియోగం తదితర అభివృద్ధి పనులు చేశామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంతో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు, మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, పెద్దాడ సుబ్బారాయుడు, ధర్నాలకోట శ్రీను, తేజోమూర్తి ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



ఏలేశ్వరంలో కబడ్డీ ఆడుతున్న యువకులు

ఏలేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు జరిగాయి. మండలస్థాయి అధికారులు పోటీలను పర్యవేక్షించారు. మండలస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

రౌతులపూడి: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండలంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని ములగపూడి, ఎ.మల్లవరం గ్రామాల్లో గురువారం మండలస్థాయి క్రికెట్ పోటీ నిర్వహించారు. రెండు బృందాలుగా 17 జట్లు పాల్గొన్నాయి.

తపోవనం పీఠాధిపతికి ఆహ్వానం



స్వామీజీకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

తుని రూరల్: అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనవలసిందిగా తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామికి ఆహ్వానం అందింది. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రతినిధులు బిక్కిన రాజు, గోవిందులు తుని మండలం కుమ్మరిలోవలోని తపోవనం ఆశ్రమానికి గురువారం వచ్చి స్వామీజీకి ఆహ్వాన పత్రిక అందజేశారు.

సత్యదేవునికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను ఏఈఓ కృష్ణారావుకు అందజేస్తున్న తటవర్తి అయ్యన్నదొర దంపతులు

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలో త్వరలో జరిగే సంక్రాంతి వేడుకల్లో భాగంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు, ఇతర దేవతామూర్తులకు అలంకరించేందుకు గాను స్థానిక వ్యాపారవేత్త తటవర్తి అయ్యన్నదొర దంపతులు గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానానికి 16 చీరలు, 16 పంచెలు సమర్పించారని వాటి విలువ రూ.లక్ష ఉంటుందని అధికారులు తెలిపారు. అర్చకుడు సుధీర్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- పలు గ్రామాల్లో పర్యటన



రౌతుపాలెంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చెందుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, రౌతుపాలెం, పెద్దిపాలెం, వేములపాలెం, ఉత్తరకంచి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, ధర్మవరం గ్రామాల్లో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, పార్టీ నాయకులు చింతల రాజు, సర్పంచులు గౌనగాల అప్పలరాజు, దేవర మానస రమేష్, పాంద్రాడ గంగారాము, బెంతుకుర్తి సుశీల అబ్బాయి, కొంగన బుల్లమ్మాయి, ఎంపీటీసీలు ఉమ్మిడి తాతీలు, అమరాది కాశీ, మాకారపు షర్మిల, వైఎస్సార్ సీపీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, గోళ్ల శేఖర్ బాబు, తుట్టా జమ్మిందార్, కొంగన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్‌శాస్త్రికి ఘన నివాళులు



ఏలేశ్వరంలో లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: భారత మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి వర్ధంతిని పట్టణంలో గురువారం నిర్వహించారు. స్థానిక దిబ్బలపాలెంలో లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రిగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. శాస్త్రి దేశంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో పాటు నిస్వార్థ రాజకీయనేతగా ప్రత్యేకస్థానం పొందారన్నారు. నేటియువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, ఉడతల రమణారావు, ఎ.నాగరాజు, దాసరి గణేష్, బంటుపల్లి అప్పారావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బంగార్రాజు

తుని రూరల్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, ఆ పార్టీకి మద్దతు తెలుపుతున్న రాజకీయ పార్టీలను ఓడించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్ఎస్ వెంకటాపురంలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తామన్నారు. కొందరు కబ్జా చేసిన ప్రభుత్వ భూముల్లో ఎర్ర జెండాలు వేస్తామన్నారు. ఎన్నో ఏళ్లగా పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించాలని, హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ప్రజల తరుపున బలమైన పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.జనార్దన్, వాడబోయిన శివ, చెరుకూరి తాతారావు, గుద్దటి అప్పారావు, దారా రాజు, దండా చినఅప్పన్న, గుద్దటి సూరమ్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



జి.ముసలయ్యపేటలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



జగ్గంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఒమ్మి రఘురాం, నాయకులు

జగ్గంపేట: విజయవాడలో రూ.404 కోట్లతో నిర్మించిన 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని, ఈ కార్యక్రమానికి అందరూ తరలిరావాలని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం కోరారు. జగ్గంపేటలో గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం సూచన మేరకు గ్రామాల్లో పర్యటించి ప్రజలను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 19న జగ్గంపేట నుంచి తోట నరసింహం ఆధ్వర్యంలో విజయవాడ తరలి వెళ్లడానికి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు జయరాజు, గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్, వైఎస్సార్ సీపీ నేతలు కాపవరపు ప్రసాద్, రామకుర్తి జగాల్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

జి.ముసలయ్యపేటలో సామాజిక సమతా సంకల్పం

తొండంగి: మండలంలోని జి.ముసలయ్యపేటలో గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం సామాజిక సమతా సంకల్ప కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో సంతకాలు సేకరించారు. 0పార్టీనాయకులు గాబు రాజు, దడాల విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.